సందడిగా సమ్మర్ క్యాంపు



సమ్మర్ క్యాంపు ముగింపు కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు

మండల కేంద్రమైన చేగుంట ఉన్నత పాఠశాలలో గురువారం యంగ్ ఇండియా సమ్మర్ క్యాంపు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ నీరజ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసి వారిని యోగా, అల్లికలు, నృత్యం, పెయింటింగ్ అంశాల్లో నిష్ణాతులుగా చేసేందుకు సమ్మర్ క్యాంపు నిర్వహించినట్లు తెలిపారు. ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పరంజ్యోతి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు రఘుపతి, శిక్షకులు శ్రీదేవి, గీత, రేణుక, ఎంఐఎస్ వినోదతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

- చేగుంట(తూప్రాన్):

సృజనాత్మకను వెలికి తీసేందుకే..



నార్సింగిలో విద్యార్థులకు జ్ఞాపికలను అందించిన ఎంఈఓ గంగాబాయి.



చిన్నశంకరంపేటలో విద్యార్థులతో ఎంఈఓ పుష్పవేణి

వేసవి శిక్షణ శిబిరం విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను బయటకు తీసేందుకు దోహదపడిందని ఎంపీడీఓ దామోదర్ అన్నారు. గురువారం చిన్నశంకరంపేట ఎంఆర్‌సీలో నిర్వహించిన వేసవి శిక్షణ కేంద్రం ముగింపులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు కంప్యూటర్, యోగా, కరాటే, అల్లికలు నేర్చుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ పుష్పవేణి, ప్లాన్ ఇండియా ప్రాజెక్టు మేనేజర్ వెంకటేశ్వర్లు, భూక్యా, మంజుల పాల్గొన్నారు.

నార్సింగిలో...

నార్సింగి జెడ్పీ పాఠశాలలో నిర్వహించిన వేసవి శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు ఎంఈఓ గంగా బాయి మోడల్స్ అందించి అభినందించారు. గురువారం జెడ్పీ పాఠశాలలో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో హెచ్‌ఎం పూర్ణచందర్‌రావు, ఆర్పీలు సుష్మిత, శశికళ, సాయి, శాంతి కుమార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

- చిన్నశంకరంపేట(మెదక్):

క్లుప్తంగా

రెండు బైక్‌లు ఢీ ఇద్దరికి గాయాలు

శివ్వంపేట(నర్సాపూర్): రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధి లింగోజిగూడ గ్రామ శివారు నర్సాపూర్‌- వెల్దుర్తి ప్రధాన రోడ్డుపై గురువారం జరిగింది. పిల్లుట్ల గ్రామానికి చెందిన రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొనగా గాడ్ల కుమార్, పెద్దగొని నర్సింలుకు గాయాలు కాగా.. స్థానికులు వారిని చికిత్స నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

12 ఇసుక డంపులు సీజ్

సాక్షి ఎఫెక్ట్..

పాపన్నపేట(మెదక్): గాడిదలపై ఇసుక తరలిస్తున్న యూసుఫ్‌పేట, ఆరెపల్లి శివారులో నిల్వ చేసిన 12 డంపులను గురువారం సీజ్ చేసినట్లు పాపన్నపేట తహసీల్దార్ సతీష్ కుమార్ తెలిపారు. అవి సుమారు 25 ట్రాక్టర్ల మేర ఉంటుందని చెప్పారు. సీజ్ చేసిన ఇసుక కుప్పలను గ్రామ రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు వివరించారు. మంజీర నది నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

అంగన్‌వాడీ టీచర్ తొలగింపు

చిలప్‌చెడ్(నర్సాపూర్): చిలప్‌చెడ్ మండలం టోప్యా తండా అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న రాట్ల భూలిని విధుల నుంచి తొలగిస్తున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ ఉత్తర్వులు జారీ చేశారని నర్సాపూర్ సీడీపీఓ హేమాభార్గవి అన్నారు. ఇటీవల తండాకు చెందిన నాలుగు నెలల శిశువు మృతికి సంబంధించి, అంగన్‌వాడీ టీచర్ భూలి సహకారం ఉన్నట్టు ఆరోపణలు వచ్చాయి. విచారణలో ఆరోపణలు నిజమని తేలడంతో భూలిని అంగన్‌వాడీ టీచర్ విధుల నుండి తొలగించారు.

శిఖం భూముల పరిశీలన



శిఖంలో ఏర్పాటు చేసిన ఇటుక బట్టీలను పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

శివ్వంపేట(నర్సాపూర్): 'శిఖం భూములు అన్యాక్రాంతం' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఇరిగేషన్ డీఈ బుచ్చిబాబు, ఏఈ సుధీర్‌కుమార్ కొత్తపేట, చండి గ్రామాల్లోని చెరువులు, కుంటలను పరిశీలించారు. ఇటుక బట్టీలు ఏర్పాటు చేసిన వారికి నోటీసులు జారీ చేశారు. సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేస్తామన్నారు. మట్టి తవ్వకాలు చేసిన వారిని గుర్తించి జరిమానాలు విధిస్తామన్నారు.

ఎల్‌ఓసీల అందజేత



లబ్ధిదారులకు ఎల్‌ఓసీలు అందచేస్తున్న ఎమ్మెల్యే

నర్సాపూర్: ప్రైవేటు ఆసుపత్రిలో మెరుగైన వైద్యం పొందడానికి ఎల్‌ఓసీలు ప్రభుత్వం నుంచి మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే సునీతారెడ్డి చెప్పారు. గురువారం ఆమె పలువురికి ఎల్‌ఓసీలు అందజేశారు. గూడెంగడ్డ చెందిన బాలమణికి, నర్సాపూర్‌కు చెందిన శ్రీనివాస్‌లకు మెరుగైన వైద్యం అవసరమైనందున వారికి సీఎంఆర్‌ఎఫ్ పథకం నుంచి రూ.లక్ష చొప్పున మంజూరు చేయించానని, అందుకు సంబంధించిన లెటర్లను వారికి అందచేసినట్లు ఆమె చెప్పారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ నాయకులు సత్యంగౌడ్, భిక్షపతి ఉన్నారు.

పంచాయతీ భవనాలకు నిధుల గ్రహణం

- నత్తనడకన సాగుతున్న నిర్మాణ పనులు
- అసంపూర్తి దశలో.. పనులు ప్రారంభం కాక మరికొన్ని..
- నిధులు సరిపోవడం లేదంటున్న కాంట్రాక్టర్లు



తుక్కాపూర్‌లో స్లాబ్ స్థాయిలో నిలిచిపోయిన భవన నిర్మాణం

కొల్చారం(నర్సాపూర్): గ్రామ పంచాయతీలకు సొంత భవనాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఉన్న గ్రామ పంచాయతీలతో పాటు నూతనంగా ఏర్పాటైన వాటికి కూడా ఈ పరిస్థితి దాపురించింది. పరిపాలన సౌలభ్యం కోసం నూతన భవనాల నిర్మాణానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలు నామమాత్రంగానే ఉన్నాయి. ఫలితంగా అవి నత్తనడకన సాగుతున్నాయి. కొన్నిచోట్ల అసంపూర్తి దశలో, మరికొన్ని చోట్ల పనులు ప్రారంభం కాక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చాలా చోట్ల అద్దె భవనాలు, ఇరుకు గదుల్లో కొనసాగుతున్నాయి. గతంలో కేటాయించిన నిధులు సరిపోవడం లేదంటూ కాంట్రాక్టర్లు కొన్ని పనులు ప్రారంభించి మధ్యలోనే ఆపేయగా, మరికొన్ని నిర్మాణం పనులు ముగ్గు పోసే దశలోని నిలిచిపోయాయి. ఇరుకు గదుల్లో కొనసాగుతున్న గ్రామపంచాయతీల భవనాల స్థానంలో కొత్త వాటి నిర్మించేందుకు 2016లో నాలుగు గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరయ్యాయి. 2023 జూన్‌లో కొత్తగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మరో ఆరు గ్రామాలకు ఒక్కో భవన నిర్మాణం కోసం రూ.20 లక్షలు మంజూరయ్యాయి. మొదట్లో మంజూరైన నాలుగు పంచాయతీల్లో కోనాపూర్, కొంగోడ్, చిన్న ఘనాపూర్, పైతర ఉన్నాయి. వీటిలో కోనాపూర్ పూర్తి స్థాయిలో భవనం అందుబాటులోకి తెచ్చారు. కొంగోడ్, చిన్నఘనాపూర్ భవనాలు పూర్తయినప్పటికీ ఇంకా అందులో మౌలిక వసతుల సదుపాయం లేకపోవడం, అరకొర వసతులతో కొనసాగిస్తూ వస్తున్నారు. పైతర గ్రామ పంచాయతీ భవనం పనులు స్థల వివాదం కారణంగా శిలాఫలకానికే పరిమితమైంది. నూతనంగా మంజూరైన భవనాల్లో ఏటిగడ్డ మాందాపూర్ భవనం నిర్మాణం పూర్తి చేసుకొని అందుబాటులోకి రాగా రంగంపేట, తుక్కాపూర్, వసురాం తండాలో భవనాలు స్లాబ్ స్థాయిలోకి వచ్చి నిలిచిపోయాయి. సీతారాం తండా, కిష్టాపూర్ భవనాలు ఇంకా ముగ్గు పోసే దశలోనే ఉన్నాయి.



పైతరలో శిలాఫలకానికి పరిమితం

నిధులు సరిపోవడం లేదంటూ వెనకడుగు

పనులను పొందిన కాంట్రాక్టర్లు గతంలో మంజూరైన భవనాల నిర్మాణం చేపట్టిన భవనాలకు మౌలిక వసతులు కల్పించేందుకు అదనపు నిధులు అవసరం ఉంది. అయితే ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. ప్రస్తుతం చేపట్టిన నూతన భవనాల నిర్మాణం పనులకు కేటాయించిన నిధులు సరిపోవన్న తలంపుతోనే మధ్యలోనే నిలిపివేయడం, ప్రధాన కారణమన్న విషయాన్ని పనులను పొందిన కాంట్రాక్టర్లు చెప్పకనే చెబుతున్నారు. అధికారులు మాత్రం పనులు కొనసాగించాలని చెబుతున్న ఆ దిశగా ముందుకు రాకపోవడం కనిపిస్తుంది. కొసమెరుపు ఏమిటంటే పనులను పొందిన కాంట్రాక్టర్లు కొందరు అధికార పార్టీకి చెందిన వారు ఉండడం, మిగతా వారిని పనులు ప్రారంభించేందుకు ఆలోచింపజేస్తూ వస్తుంది. ఏదేమైనా ఈ విషయంలో ప్రభుత్వం స్పందించి వెంటనే భవన నిర్మాణాల పనులను త్వరితగతిన పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పనులు పూర్తయ్యేలా చర్యలు



ప్రస్తుతం కేటాయించిన నిధులతో భవన నిర్మాణం పనులు పూర్తి చేశాం. వీటిని ప్రారంభించాలని ఇప్పటికే డీపీఓ సదరు కాంట్రాక్టర్లతో చర్చించారు. అదనపు నిధుల కోసం ప్రతిపాదనలు పంపాం. త్వరలోనే పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– అమరేశ్వర్, డీఈ

● బోనం.. ఘనం



బొడ్మట్‌పల్లిలో బోనాల ఊరేగింపు

టేక్మాల్ మండలం బొడ్మట్‌పల్లిలో గురువారం గ్రామదేవతలు దుర్గమ్మ, పోచమ్మలకు బోనాల ఊరేగింపు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. శుక్రవారం బండ్ల ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బస్వరాజ్ తెలిపారు.

– టేక్మాల్(మెదక్):

వేలాడుతున్న 11 కేవీ విద్యుత్ తీగలు

పట్టించుకోని అధికారులు

నిజాంపేట(మెదక్): నిజాంపేట మండల పరిధిలోని నస్కల్ గ్రామ శివారులో ఓ రైతు పొలంలో విద్యుత్ తీగలు వేలాడుతూ ఉన్నాయి. గ్రామానికి చెందిన రైతు టేకుమల్లె యాదయ్య పొలంలో వేలాడుతున్న 11 కేవీ విద్యుత్ తీగలు మనిషికి మీటరు ఎత్తులో ఉండటం వల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఎన్నిసార్లు సంబంధిత విద్యుత్ అధికారులకు తెలిపినా ఫలితం లేకుండా పోయిందని, ప్రస్తుతం ఆ స్థలంలో వరి పంటలు కోసి ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సందర్శించి, వేలాడుతున్న తీగల నుంచి ప్రమాదం జరగకుండా కాపాడుతారని రైతు యాదయ్య ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.



నస్కల్‌లో వేలాడుతున్న విద్యుత్ తీగలు

పెద్దమ్మతల్లి వార్షికోత్సవాలు ప్రారంభం

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని సూరారం గ్రామంలో మూడు రోజుల పాటు నిర్వహించే పెద్దమ్మతల్లి 16వ వార్షికోత్సవ ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, స్వస్తి పుణ్యాహవాచనం, గణపతి పూజ నిర్వహించారు. శుక్రవారం అగ్నిప్రతిష్ఠ, చండీహోమం, అమ్మవారి కల్యాణం, ఒడిబియ్యం, బోనాలు తీయుట తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. శనివారం అమ్మవారికి ఎడ్ల బండ్ల ఊరేగింపు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

పకడ్బందీగా ధాన్యం కొనుగోలు



ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీసీఓ కరుణాకర్

పెద్దశంకరంపేట(మెదక్): జిల్లా వ్యాప్తంగా పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు పకడ్బందీగా చేపడుతున్నట్లు జిల్లా సహకార ఆడిట్ అధికారి కరుణాకర్ అన్నారు. గురువారం పెద్దశంకరంపేట మండలంలో నిర్వహిస్తున్న జొన్న, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ధాన్యం కొనుగోలు, తరలింపులో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని పీఏసీఎస్ సీఈఓ రవీందర్‌కు సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

చివరి గింజ వరకు కొంటాం



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

నర్సాపూర్ రూరల్: అకాల వర్షాలతో రైతులు అధైర్య పడొద్దని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని నర్సాపూర్ తహసీల్దార్ శ్రీనివాస్ రైతులకు హామీ ఇచ్చారు. గురువారం మండలంలోని రామచంద్రపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. కొనుగోలు ప్రక్రియ, ధాన్యం రవాణా, ట్యాబ్ ఎంట్రీతో పాటు రికార్డులను పరిశీలించారు. నిర్వాహకులు రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సిద్దిరాంరెడ్డి, ఐకేపీ ఏపీఎం గౌరీశంకర్, సీసీ దేవీ సింగ్, సీఏ నీరజ ఉన్నారు.

ఆందోళనకు సిద్ధమైన రైతులు

పాపన్నపేట(మెదక్): ధాన్యం కొనుగోళ్లలో జాప్యాన్ని నిరసిస్తూ రైతులు ఆందోళనకు సిద్ధం కాగా, పోలీసులు అడ్డుకున్న సంఘటన గురువారం సాయంత్రం మిన్‌పూర్‌లో చోటు చేసుకుంది. మిన్‌పూర్‌లో ధాన్యం కొనుగోళ్లు సరిగా జరగడం లేదని, వర్షం పడితే తమ పరిస్థితి అగమ్య గోచరమని ఆవేదన వ్యక్తం చేస్తూ రైతులు మెదక్- బొడ్మట్‌పల్లి రోడ్డుపై ఆందోళన చేసేందుకు సిద్ధమయ్యారు. అదే సమయంలో అటు వైపు వెళ్తున్న పాపన్నపేట పోలీసులు రైతులను సముదాయించి ఆందోళన విరమింపజేశారు.

దుర్గమ్మ సేవలో ఎమ్మెల్యే సునీతారెడ్డి



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల వన దుర్గమ్మను గురువారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు, ఆలయ సిబ్బంది ఆలయ మర్యాదల ప్రకారం ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేసి సత్కరించారు. ఆమె వెంట నర్సాపూర్ నియోజకవర్గ కార్యకర్తలు ఉన్నారు.

మహిళలకు స్కూటీల పంపిణీ

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ జన్మదినం సందర్భంగా బీఆర్‌ఎస్ మహిళా కార్యకర్తలకు గురువా రం ఎలక్ట్రిక్ స్కూటీలు పంపిణీ చేశారు. పట్టణంలోని ఆయన నివాసంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ మహిళా కార్యకర్తలు కుమార్ యాదవ్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ శిఖర కలశాలు అందజేత

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గూడూర్ గ్రామంలో నిర్మించిన శ్రీ గురుపీఠంలో సాయిబాబా, దత్తాత్రేయ ఆలయాల్లో ప్రతిష్ఠించేందుకు పలు వస్తువులను దాతలు అందజేసినట్లు గురుపీఠం చైర్మన్ శివకుమార్‌గౌడ్ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ శ్రీనివాస్ ఇందిరా దంపతులు శ్రీ దత్తాత్రేయ స్వామికి లక్ష 79 వేల రూపాయల విలువ చేసే ఐదు ఇత్తడి శిఖర కలశాలను అందజేసినట్లు చెప్పారు. విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలకు రావాల్సిందిగా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్‌కు ఆహ్వాన పత్రికను అందజేశారు.

◆ బీరప్ప స్వామివారికి పూజలు

చిన్నశంకరంపేట(మెదక్): బీరప్పస్వామి కృపతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కె.తిరుపతిరెడ్డి కోరారు. గురువారం చిన్నశంకరంపేట మండలం ధరిపల్లి గ్రామంలో బీరప్ప ఆలయ వార్షికోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట మాజీ వైస్ ఎంపీపీ సత్యనారాయణగౌడ్, మాజీ ఎంపీటీసీ అంజాగౌడ్, మాజీ సర్పంచ్‌లు యాదగిరి, శ్రీనివాస్, మహిపాల్ రెడ్డి, సంజీవరెడ్డి, పాండు ఉన్నారు.

◆ ఏకగ్రీవ ఎన్నిక

పటాన్‌చెరు: నియోజకవర్గ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం ఎన్నిక ఏకగ్రీవం అయింది. గురువారం పటాన్‌చెరు పట్టణంలో నియోజకవర్గంలో పనిచేస్తున్న నాల్గవ తరగతి ఉద్యోగులు పటాన్‌చెరు టీఎన్జీఓ అధ్యక్షులు, కార్యదర్శులు (ఎన్నికల అధికారులు) ప్రమోద్ కుమార్, విశ్వేశ్వర్ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్యాం రావు, సహాయ అధ్యక్షుడిగా మహ్మద్ మొయినొద్దీన్, కార్యదర్శి అబెల్, కోశాధికారి రామ్ బహదూర్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

◆ పేదింటి ఆడపడుచు వివాహానికి సాయం

నారాయణఖేడ్: పట్టణానికి చెందిన ఖాజా మియా పేదరికం కారణంగా తన కూతురి వివాహం చేయడానికి పడుతున్న ఇబ్బందులను తెలుసుకుని ముస్లిం కమిటీ బాధ్యులు ఆర్థిక సహాయం అందజేశారు. కమిటీ కార్యాలయంలో గురువారం రూ.12 వేలతో పాటు క్వింటాలు బియ్యాన్ని ఖాజామియాకు అందజేశారు. కమిటీ బాధ్యులు మాట్లాడుతూ పేద కుటుంబాలకు ఆసరాగా నిలవడమే తమ ఉద్దేశ్యమన్నారు. కమిటీ బాధ్యులు వసీంక టీబ్, హాసం తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు పురస్కారం



ప్రశంసా పత్రాలతో చేగుంట మోడల్ పాఠశాల విద్యార్థులు

మండల కేంద్రమైన చేగుంటలోని మోడల్ పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు ప్రశంసా పత్రాలు అందుకున్నట్లు ప్రిన్సిపాల్ చంద్రకళ తెలిపారు. ఇటీవల పదోతరగతి పరీక్షల్లో మోడల్ పాఠశాలకు చెందిన విద్యార్థులు శ్రీనిధి, కార్తిక్, చైత్రశ్రీ, సహస్రారెడ్డి, భువనేశ్వరీ, వర్ష, రసజ్ఞ, రిషికలు మండల స్థాయి టాపర్లుగా నిలిచారు. వీరంతరికీ కలెక్టర్ రాహుల్‌రాజ్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందించారని వందశాతం ఉత్తీర్ణత సాధించినందుకు పాఠశాలకు సైతం ప్రశంసా పత్రం అందించారని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఒకే పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు టాపర్లుగా నిలవడం పట్ల ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

- చేగుంట(తూప్రాన్):

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

ఎమ్మెల్యే సునీతారెడ్డి

హత్నూర (సంగారెడ్డి): అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి డిమాండ్ చేశారు. హత్నూర మండలం దౌలాపూర్ దౌల్తాబాద్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఎమ్మెల్యే సునీతారెడ్డి సందర్శించి తడిసిన ధాన్యాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...ధాన్యం తెచ్చి రోజులు గడిచినా కేంద్రాల వద్ద కొనుగోళ్లు చేయకపోవడంతోనే వర్షాలకు ధాన్యం తడిచిపోయిందన్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని లేకుండా ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.



దౌలాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన ఎమ్మెల్యే సునీతారెడ్డి

ఉపాధీ కూలీలకు పనులు కల్పించండి

కల్హేర్(నారాయణఖేడ్): ఉపాధిహామీ పథకం కింద కూలీలకు పనులు కలిపించాలని ఎంపీడీఓ రమేశ్ బాబు సూచించారు. మండల పరిషత్‌లో పంచాయతీ సెక్రటరీలు, ఈజీఎస్ సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల గురించి కూలీలకు అవగాహన కలిపించాలన్నారు. నర్సరీల ఏర్పాటు, ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం తదితర కార్యక్రమలపై సమీక్ష నిర్వహించారు. ఎంపీఓ శ్రీనివాస్, ఏపీఓ వేణుమాధవ్ పాల్గొన్నారు.